రోడ్డుపైన దొర్లాడుతూన్న సాయంత్రపు ఎర్రని పలుచని ఎండ బంతిలాగ సైడుకాల్వలోకి జారిపోతూంది.

ఆఫీసునుంచి భానుమూర్తి రైల్వేస్టేషనుకు కాలినడకనే బయల్దేరాడు. సాయంత్రాలు నడవడమంటే అతనికెంతో ఇష్టం, సరదా కూడాను. సాయంత్రపు సౌందర్యాన్ని మనోఫలకంపై రబ్బరుస్టాంపువలె ముద్రించుకోవాలంటే— నడవడం వల్లనే అది బాగా సాధ్యపడుతుందని అతని అభిప్రాయం. భానుమూర్తి సౌందర్యోపాసకుడు. అందమైన దృశ్యాల్ని తిలకించటం ద్వారా అనుభవాల్ని పెంచుకొని ఆనందపడే మనస్తత్వం అతనిది. సౌందర్యాన్వేషణ అతని జీవితాదర్శాల్లో ప్రధానమైనది. చిన్నతనం నుంచీ ప్రకృతిసౌందర్య ప్రభావం అతని మనస్సుపై పనిచేస్తూనే ఉన్నది. హైస్కూల్లో చదివే రోజుల్లో ప్రతిరోజూ సాయంత్రపువేళ అట్లా బకింగుహామ్ కెనాల్ ఒడ్డుకు వెళ్లి—సూర్యుని ఆఖరి కాంతికిరణాలు మనోహరంగా ప్రవహించే నీటి అలలపై పడటాన్ని, చల్లగాలికి వచ్చని తోటల తలల ఆడింపునూ, పొట్టకు వచ్చిన వరిచేల శోభనూ, సర్వీచెట్ల గోలనూ చూస్తూ మైమరచేవాడు. యూనివర్సిటీలో చదువుతూన్న రోజుల్లో కూడా వాల్తేరులో ప్రతి సాయంకాలమూ సముద్రపుఒడ్డునే నీటిఅలలపై దిగజారే సంధ్యాకాంతినీ, వెన్నెలనూ — వీక్షిస్తూ ఏకాంతంగా కాలక్షేపం చేసేవాడు. ఆనర్సు డిగ్రీ పుచ్చుకున్నాక ఉద్యోగంలో ప్రవేశించకపూర్వం — పదిహేను వందలరూపాయలు చేతపట్టుకొని ఆరునెలలపాటు దేశంలోని సుందర ప్రదేశాలనన్నింటినీ దర్శించి వచ్చాడు. దక్షిణ భారతంలోని రామేశ్వరం, శ్రీరంగం, మధుర, కంచి, తిరుపతి మొదలైన పుణ్యక్షేత్రాలూ, కేరళలోని కొబ్బరితోటలూ, మైసూరు బృందావన్ గార్డెన్సూ, ఉత్తరభారతంలో ఆగ్రా తాజమహల్, జబల్పూరు మార్బుల్‌రాక్స్, కుజరహో, అజంతా, ఎల్లోరా మొదలైన శిల్పకళాఖండాలనూ, బొంబాయి, ఢిల్లీ, కలకత్తా నగరాలనూ, కాశ్మీరు లోయల దృశ్యాలనూ — చూసి వచ్చాడు. ప్రకృతి సౌందర్యంపై ఉన్న మోజు, ఆసక్తి, భావావేశం ఇప్పటికీ భానుమూర్తిలో లవలేశం తగ్గలేదు. ఎప్పుడు,— ఎక్కడ అందమైన వస్తువులు కనబడ్డా ఖరీదుకు జంకకుండా కొని ఇంట్లో అమర్చేవరకు అతని కళాహృదయం చల్లబడదు.

భానుమూర్తి స్టేషనులో అడుగుపెట్టేసరికి సూర్యుడు పూర్తిగా పించనీ పుచ్చుకున్నాడు. మునిమాపు మూసినకన్ను మెల్లగా తెరచింది. బుకింగు ఆఫీసులో ప్లాట్‌ఫారం టిక్కెట్టు కొనుక్కుంటూ — నోటీసుబోర్డుకేసి చూశాడు 'మద్రాసుపోవు ప్యాసింజరు 90 నిముషాలు ఆలస్యంగావచ్చును' అనివ్రాసిఉంది. భానుమూర్తి నెమ్మదిగా ఆరిన అప్పడంలాంటి నిట్టూర్పు విడిచి, ఓవర్‌బ్రిడ్జి ఎక్కి ప్లాట్‌ఫారం మీదకు వెళ్లాడు. అప్పుడే స్టేషనులోని విద్యుద్దీపాలు ఒక్కసారి డ్యూటీలోకి ప్రవేశించాయి. ట్రైన్ కోసం నిరీక్షిస్తోన్న ప్రయాణీకుల నిట్టూర్పుల పొగలతో ప్లాట్‌ఫారం బరువుగా ఉంది. కాలహరణకోసం భానుమూర్తి ప్లాట్‌ఫారంపై పచార్లు చేయనారంభించాడు.

జానకి ఈ ట్రైన్‌కు తప్పకుండా వస్తుంది. జానకికోసం తను స్టేషనుకు రావటం—ఆమె మీద తనకున్న ప్రేమాభిమానాల పటుత్వాన్నీ, మూడురోజులుగా ఆమెలేని లోపంవల్ల తనలో ఏర్పడిన అశాంతీ, ఏమీతోచని పరిస్థితీ, బాధా, ఆమెరాకకోసం నిరీక్షణలోని తీవ్రతనూ, లాలసనూ వ్యక్తీకరిస్తాయనడంలో సందేహం లేదు. తన మొదటి భార్య కమల ఎన్నిసార్లు పుట్టింటికి వెళ్లివస్తున్నా, తను ఇట్లా ఎన్నడూ ఆమెకోసం స్టేషనుకు వచ్చియుండలేదు. ఆమె లేకపోవడంవల్ల తనలో ఎన్నడూ ఇట్లాంటి అశాంతీ, ఏమీతోచని పరిస్థితీ, బాధా ఏర్పడలేదు, ఆమె రాకకోసం తను ఎన్నడూ ఇంతగా నిరీక్షించలేదు. కారణం. తను ఆమెను ప్రేమించలేదు. ప్రేమించలేకపోయాడు. అంతే! అది తన బలహీనత కాదు, అవివేకం కాదు, హృదయవిశాలత లోపించి కాదు. తను అందంకోసం అర్రులు చాస్తాడు, అందాన్ని ఆరాధించడం తన జీవితోద్దేశ్యం. శిల్పకళా ఖండమైనా, కొయ్యబొమ్మయైనా, ప్రకృతిదృశ్య భాగమైనా, ప్రాణంగల జీవియైనా, స్త్రీయైనా — సౌందర్య కోణంద్వారా మంచిచెడులను నిర్ణయించుకొని మనస్సులో అభిప్రాయాన్ని ఏర్పర్చుకొనే అలవాటుకు దాసుడైనాడు. తనమనస్సుపై, హృదయంపై, ఆత్మపై — దృష్టి ఎక్కువ అధికారాన్ని సంపాదించి, తన జీవితాన్ని కాలానికి పెనవైచి ముందుకు లాక్కెడుతూంది. మొదటిభార్య కమలను తను ప్రేమించలేకపోవడానికి దృష్టి తన ఆత్మలు అధిగమించి నిర్ణయాలను చేసికోవటానికి పూర్తిగా తోడ్పడటం ముఖ్యమైన హేతువు. కమల అందమైనది కాదు. తనకి నచ్చిన, తను ఆరాధించే, తన ఆదర్శం కోవకు చెందిన అందం ఆమెలో లేదు. అమావాస్యనాటి అర్ధరాత్రి పీడకలవలె ఆమె తన జీవితంలో భాగస్వామినిగా ప్రవేశించింది. తను కోరి ఆమెను వివాహమాడలేదు. కొన్నిపరిస్థితుల బలవత్తర శక్తికి లోబడి ఆమెను పరిణయమాడాడు. తర్వాత ఆమెను ప్రేమించలేకపోవడం తన తప్పు కాదు. ఆమె బ్రతికి ఉన్న కాలంలో తను ద్వేషించడం, ఆమె ప్రేమను గుర్తించకపోవడం, పవిత్ర బంధాన్ని గౌరవించకపోవడం — తను అన్యాయం చేసినట్టు కాదు. ఆమె అతనిని దైవంగా భావించింది. తన ప్రేమను సంపాదించడంకోసం, తన అభిమానాన్ని చూరగొనడంకోసం, తనని సుఖపెట్టడంకోసం — తనతో కాపురంచేసిన అయిదేళ్లూ శతవిధాలా ప్రయత్నించింది. కాని విఫలురాలైంది.

తను జాలి చూపడం మినహా ఏమీ చేయలేకపోయాడు. హృదయంలో చోటును కల్పించలేకపోయాడు. ఆమె సద్వర్తని. సహృదయురాలు. సుగుణాలరాశి. తనకు తెలుసు. కాని ఏం! లాభం ? మొగిలిపువ్వు మంచి సువాసన కలదే కాని పూజార్హంకాదు. కమల అట్లాంటిది. సువాసన పూరితమైన అంద విహీనమైన పువ్వు పగిది ఆమె తనని ఆకర్షించ లేకపోయింది. ఆమె హృదయపుష్పత్వం ఆమె అంద విహీనతని కప్పివేసి తన ప్రేమను పొందలేక పోయింది. నీటి అలలపై —బడిమెరిసే సంధ్యాకాంతిని ప్రేమించే తనకు ఆమె పొగ చూరిన గోడవంటి శరీరకాంతి నచ్చలేదంటే గులాబిపువ్వు పేశలత్వాన్ని అభిలషించే తనకు తుమ్మచెట్టు బెరుడులాంటి ఆమె ముఖం అందంగా కనబడలేదంటే; నిశ్శబ్దం రాజ్యం చేస్తూన్న సరస్సులో మనోజ్ఞంగా తిరుగాడే హంసను మెచ్చుకొనే తనకు గవిడి గేదవలె నడిచే ఆమెనడక రోతకలిగించిందంటే —తనది తప్పా ? కాదు. ఆమె జీవితం ప్రేక్షకుల చేత కన్నీళ్లు కురిపించిన విషాదాంత చలన చిత్రంవలె ముగిసిందంటే —అందులో తన బాధ్యత ఏమీ ఇమిడి లేదు. ఆమె మరణం విధి లిఖితం. తన చేష్టలకూ, తను ప్రేమ చూపకపోవడానికీ— ఆమె చావుకూ పొత్తు లేదు. పెద్దబావిలో నీళ్లు తోడుతూ కాలుజారి బావిలో పడి వెంటనే పైకి తీసే లోపుగానే ఆమె చనిపోయిందంటే—అది

కేవలం కర్మఫలంకాక అందులో తన నేరమేముంది ఆసమయంలో తను ఇంట్లో కూడాలేడు. ఆఫీసు నుంచి వచ్చాడు యీ దుర్వార్తవిని. గుండెబాదు కొని చనిపోయిన భార్యకోసం కన్నీళ్లు కార్చ లేదంటే — ఆమె మరణం తనకు సంతోష కార ణమని ఇతర్లు ఊహించడంలో ఏం సబబువుంది? తర్వాత తను సంవత్సరం తిరుగక ముందే జానకిని పెళ్లిచేసి కొనటంలో — తను కమలను పూర్తిగా మర్చిపోయినదేముంది ? జానకి నిజంగా అందాల కాణాచి. సృష్టి సౌందర్యపు గొప్పదనాన్ని పుణికి పుచ్చుకున్న స్త్రీ. తనకు నచ్చిన, తను ఆరాధించే, తన ఆదర్శం కోవకు చెందిన అందానికి ఆమె ప్రతి రూపం. ఆమెను చూసిన ప్రథమ వీక్షణంలోనే ఆమె అనన్య సౌందర్యప్రభ తన మనస్సుపై గాఢంగా హత్తుకుపోయింది. ఆమె శరీరకాంతి, తలకట్టూ, ముఖ వర్చస్సూ, అంగసౌష్ఠవమూ —పూహా సుందరికి సాదృశ్యమై, ఆమె మీద ఎనలేని ప్రేమాభిమానాల పుట్టుకకు కారణాల య్యాయి. జానకి నిజంగా గులాబి పువ్వే! గులాబి పువ్వుకు అందమూ, సువాసన రెండూ ఉన్నాయి. జానకికి అందమూ, హృదయమూ రెండూ ఉన్నాయి. ఇంకా తన బ్రతుకూ, ఆదర్శమూ, కోర్కెలూ, ఆలోచనలూ — సఫలత బొందక ఏముంది ? "నేను నిజంగా పూర్వజన్మలో ఎంతో సుకృతం చేసికొని వుంటాను. కనుకనే మీరు నాకు భర్తగా లభించారు. మీ పాదసన్నిధిని నాజీవితాన్ని సఫలత చేసికొనుటయే నాబ్రతుకు విలువ. అన్నది జానకి శోభనం నాడు. హృదయ పూర్వకంగా ప్రేమించే భార్యనుంచి భర్త ఎక్కువ ఏం వాంఛిస్తాడు ? తమ సౌంద ర్యాన్ని ఆరాధిస్తాడు. అది తన భార్యలో సంపూ ర్ణంగా వుంది. తన భార్య తనని నిర్మల హృద యంతో, జీవితాదర్శంగా ఆరాధిస్తోంది. భార్యా భర్తల అంతరాత్మలు ఇట్లా ఒక్కత్రాటిపై క్రోడీకరింపబడినప్పుడు ఆదాంపత్యం ఆదర్శ వంతమై, సుఖప్రాప్తికి మార్గదర్శకం కాక ఏముంది ?. . . అనుకుంటూ భానుమూర్తి ప్లాట్‌ఫారంమీద పచార్లు చేస్తూండగా, "ఏమం డోయ్" అన్న ఓస్త్రీ కేక వినిపించి గిరుక్కున వెనక్కు తిరిగాడు.

ఇరవై రెండేండ్ల వయస్సు గల ఓవన్నెల విసనకర్రలాంటిస్త్రీ హ్యాండ్‌బ్యాగ్ వూపు కుంటూ పెదాలపై సహజమైనచిరునవ్వు చిందుల వేస్తూండగా — దగ్గర కొచ్చింది. ఆమె అందు మైనది అనడం కంటె అందంగా వుండేందుకు ప్రయత్నించింది అనడం సమంజసం.

"ఓ! మీరా! శోభా దేవిగారా! ఎక్కణ్నుంచి! ఇక్కడున్నారు. . ." అన్నాడు భానుమూర్తి. స్కూలుఫైనలు చదువుతూన్నప్పటి స్నేహితు రాల్ని కల్సికొన్న ఉత్సాహంతో.

"మీరు. . ."

"ఇక్కణ్నే. ఈ వూళ్లోనే ఉద్యోగం. మీరేం చేస్తున్నారు ?"

"నేనా! తాడికొండ 'బ్లాక్‌లో ఎస్. ఇ. ఓ.గా పనిచేస్తున్నాను. ఎంతో కాలానికి కల్సికున్నాం. హైస్కూలు విడిచిపెట్టిన దగ్గర్నుంచీ ఇదే మొదటిసారి తటస్థ పడటమన్న మాట. కులాసా యేనా ? పిల్లలెంతమంది ?" అన్నదామె బుగ్గ చొట్టబడేట్టు నవ్వుతూ.

"ఆ!. . . ఇంకాలేరు. మరి మీకూ"

"నాకు! ఉహు! ఇంకాపెళ్లేకానిదే"

"ఓహో. ఇంకా పెళ్లిచేసికోలేదన్నమాట. ఏం. ఎందుచాత! పెళ్లిచేసికోదల్చుకోలేదా ? లేక తగిన వరుడు లభించకనా ?'

"రెండూ కాదు"

"మరి—"

భానుమూర్తి, శోభాదేవీ దాదాపు మద్రాసు వెళ్లే ప్యాసింజరుట్రైన్ అవుటర్ సిగ్నలు దగ్గ రకు వచ్చేవరకూ పిచ్చాపాటీ మాట్లాడు కుంటూనే ఉన్నారు. ఆమె రెండురోజులు సెలవుపెట్టి స్వగ్రామం వెళుతూన్నాదట. భానుమూర్తి తాను పుట్టింటికి వెళ్లివస్తూన్న భార్యను కల్సికొనేం దుకు స్టేషనుకు వచ్చినట్టు చెప్పాడు. ట్రైన్ వస్తూన్న చప్పుడు కొద్దిగా వసిగట్టగానే ప్లాట్ ఫారంమీద హడావుడి ఒక్కసారి హెచ్చింది. ప్రయాణీకులంతా సర్దుకొంటూ రైలు ఎక్కే యుద్దానికి సన్నిద్ధులవుతున్నారు.

ట్రైన్‌వచ్చి ప్లాట్‌ఫారంమీద ఆగింది.

సెకండుక్లాసు భోగీలో వుండి జానకి— ప్లాట్‌ఫారంమీద తన భర్త మరోస్త్రీతో నవ్వుతూ, కులాసాగా వీడ్కోలిచ్చి—తనకోసం పెట్టెలన్నీ వెతకటాన్ని స్పష్టంగా చూసింది. ఆదృశ్యం చూసిన ఆమె మనస్సు ఒక్కసారి గాలి తీవ్రతకు చెదిరిన పువ్వులాగైంది.

భానుమూర్తి జానకి దగ్గరకు వచ్చాడు— 'నిజంగానే వచ్చావే' అన్నట్టు ముసిముసినవ్వులు నవ్వుతూ. జానకి ముఖం చిటపటలాడుతూాం డగా కంపార్టుమెంటు దిగింది చేతిలోని బ్యాగుతో.

"ప్రయాణం విసుగులేకుండానే జరిగిందా? ట్రైన్‌లేటు గనుక—బాగా అలసిపోయి వుంటావు. మీఆమ్మగారికి జ్వరం నయమైందా పథ్యం పెట్టారా?" మొదలైన ప్రశ్నల వర్షాన్ని విరామం లేకుండా కురిపించాడు భానుమూర్తి తన ఆదుర్దా కొద్దీ.

కాని జానకి 'ఊ ఆఁ అనడం తప్ప ఒక్క ప్రశ్నకూ నోరు తెరచి సమాధానం చెప్పలేదు. ఆశ్చర్యం వేసింది భానుమూర్తికి. తనభార్య తనకోసం తహతహలాడిపోతుందని భావించాడు. ఎన్నో విషయాలు చెబుతుందనీ, తన ఎడబాటు వల్ల పడిన బాధను వివరిస్తుందనీ ఆశించాడు. కాని ఆమె ముఖం అంతర్గత వేదనతో ముడుచు కొని వుండటాన్ని చూసి భానుమూర్తి నిరాశతో కృంగిపోయి నిశ్చేష్టుడైనాడు.

ఇంటికి వెళ్లేందుకు స్టేషను బయట

(మిగతా 49 వ పేజీలో)


కాశ్మీర్ శాలువ



రు. 6/- మాత్రమే
పెద్ద సైజు కాశ్మీరు శాలువ మీరుకోరిన రంగులో రు. 6/— లకే పొందండి. ప్యాకింగు పోస్టేజి రు 1—50 అదనం. 2 శాలువలు రు 12/— పోస్టేజి ఉచితం. 4 శాలువలు రు 20/— పోస్టేజి ఉచితం.

**HIND SHAWL HOUSE,**
**Urdu Bazar (A.P.W.), Delhi-6.**



తేజ్ - ఓ - బల్

నరముల బలమునకు శరీర దార్ఢ్యతకు శాస్త్రీయముగా తయారు చేయబడిన ఔషధము

"తేజ్-ఓ-బల్" సి. కే. యస్. రీసెర్చి లేబొరేటరీలో తయారైన ఔషధములలోకెల్ల శ్రేష్ఠమైనది. సుల భముగా. జీర్ణమయేట్లు గ్లిసరో ఫాస్పేట్సు, స్ట్రిక్‌నైన్, లోహములతో దేశీయ మూలికల సారమును మిశ్ర మముచేసి చాలామందికి వాడబడిన దివ్యౌషధము. ఇది టానిక్కులలో సరిక్రొత్తది.

"తేజ్-ఓ-బల్" దిగువ వాటికి అమోఘముగా గుణము నిచ్చును—

1. సాధారణ బలహీనత.
2. మానసికంగాను, శారీరకంగాను నీరసము.
3. ధాతుపుష్టితగ్గుట, నిద్రలేవి.

సి. కె. సేన్ అండ్ కో
ప్రయివేటు లిమిటెడ్
జబాకుసుం హౌస్, 34, చిత్తరంజన్ అవెన్యూ, కలకత్తా.
1, టక్కర్స్‌లేన్, బ్రాడ్‌వే, మద్రాసు.

ఆంధ్రకు సోల్ డిస్ట్రిబ్యూటర్సు:
శ్రీపతి మెడికల్ కన్సరన్,
బోస్‌రోడ్, తెనాలి.

[15 వ పేజీ తరువాయి]

సైకిలు రిక్షా ఎక్కారు. ఆమె మౌనంలోని గంభీరతను గమనించి అతను మాట్లాడలేదు. మనస్సులో ముద్రితమైన దురుద్దేశపు దృశ్యం తాలూకు ప్రభావం పనిచేస్తూండగా ఆమె హృదయావేదనను సాధ్యమైనంత వరకు ముఖ కవళికలద్వారా బయటపెట్టకుండా వుండేందుకు ప్రయత్నిస్తూ వుంది. విద్యుద్దీపాల తెల్లని కాంతిలో మునిగితేలుతూన్న రోడ్లమీద రిక్షా వెళుతూంటే ఇద్దరూ మూగవేదనలతో మెదలకుండా కూర్చున్నారు.

రిక్షా ఇంటిముందు ఆగగానే భానుమూర్తి ముందుగా దిగి, రిక్షావాడికి డబ్బులిచ్చి — ఇంటి తాళం తీశాడు. ఆమె కొత్త చుట్టంమల్లే ఇంట్లోకి వచ్చింది.

"ఏమిటి అలా వున్నావు? ఒంట్లో బాగుండలేదా?" అన్నాడు భానుమూర్తి ఆమె ముఖంలోని మబ్బుతెరను ఏమీ అర్థంచేసుకోలేక.

"ఏమీలేదు" అని ముక్తసరిగా సమాధానం చెప్పిందామె హ్యాండ్‌బాగు డ్రాయరుమీదపెట్టి వంటగదిలోకి వెళుతూ.

• • •

జానకి పుట్టింటికి వెళ్ళివచ్చిన దగ్గర్నుంచి —వూహించలేని మార్పును ఆమెలో గమనిస్తూ వచ్చాడు భానుమూర్తి. ఆమెలో మునుపటి ఉత్సాహమూ, ముఖంలో కళా, మాటలో మెత్తదనమూ, చూపులో నిర్మలతా, నవ్వూ గోచరించటంలేదు. పలకరిస్తేగాని పలకని అయోమయస్థితిలోకి ఆమె హఠాత్తుగా దిగజారింది. భానుమూర్తి గాబరా పడ్డాడు భార్య పరిస్థితి గమనించి. కారణం అడిగాడు:

"జానకీ! ఏమిటి, అలా వుంటున్నావు? పిలిస్తేగాని పలకవు. 'అన్నం తిన్నావా?' అని అడిగితేగాని తినవు. నీ పరిస్థితి నాకేమీ అర్థంగావటంలేదు. పుట్టింటికి వెళ్ళివచ్చిన దగ్గర్నుంచి అదోలా వుంటున్నావు. అక్కడ ఏం జరిగింది? చెప్పు, చెప్పవూ? .... హృదయంలో ఏదో బాధను పెంచుకుంటున్నావు. మనస్సులో ఏదో దిగులును నూరుకుంటున్నావు. ఆ బాధనూ, దిగులునూ పంచుకొనే హక్కు నాకూ వుంది. చెప్పు, సుఖాన్నా, సంతోషాన్నా, వేదనలూ, నీకొచ్చిన కష్టమూ — అనుభవించేందుకూ, తీర్చేందుకూ సిద్ధంగా ఉన్నాను. హృదయంవిప్పి, నిజం చెప్పు. నువ్వు ఏం తప్పు చేసినా నేను క్షమిస్తాను. నావల్ల ఏదైనా తప్పు జరిగినా పశ్చాత్తాపపడతాను. మన ఇద్దరి పదో క్షణంలో ఏదైనా దుర్భిక్ష అడ్డుపడ్డు తీర్చుకుంటే —ఉభయులూ శిక్ష అనుభవిస్తాము. చెప్పు, జానకీ! ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకొన్న మన మధ్య దాపరికాలు దేనికి? అనుమానాల వలయా లెందుకు? మన జీవిత మార్గాల్లో హెచ్చరికలేని దుర్ఘటనల ప్రమాదకరమైన ఆటంకాలకు తావు కల్పించకుండా ఎప్పుడూ తెరిచిన అధ్యాయంలా వుందాము— ఆనందాన్ని అనుభవించడం మన ముఖ్యోద్దేశం. చెప్పు, జానకీ! ఎందుకిలా పరిసరాలతో సంబంధంలేనంత అలక్ష్యంగా వుంటున్నావు?" అని ఎంతో వ్యథిత కంఠంతో అడిగాడు భానుమూర్తి.

జానకి పెదవి కదల్చలేదు. ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది. చూపుల్ని గోడపైకి మళ్ళించింది. సమాధానంలేదు.

భానుమూర్తి విలవిలలాడిపోయాడు.

భార్య అయోమయ పరిస్థితికి కారణం ఎంత వెతికినా అతని ఆలోచన పరిధిలో కనిపించలేదు. పైపెచ్చు ఆపరిస్థితి ఎట్లాంటి దుష్ఫలితానికి దారితీస్తుందో, ఆమె భవిష్యత్తు ఎట్లాంటి దుస్థితికి దిగజారుతుందోనన్న భయం అతనిలో గజగజలాడుతోంది.

భానుమూర్తికి రోజూ ఆఫీసునుంచి అయిదున్నరకే ఇంటికిరావడం జానకి కాపురానికివచ్చిన దగ్గర్నుంచి పరిపాటి అయింది. ఎప్పుడేనా ఆలస్యంగా వస్తే, జానకి తగిన సంజాయిషీ అడిగి పుచ్చుకొనేది. కాని ఆరోజు భానుమూర్తి అర్ధరాత్రి ఇంటికి వచ్చాడు. అప్పటివరకూ జానకి పడకగదిలో మేల్కొనే ఉంది. ఆమెచేతిలో ఏదోనవల ఉందికానీ ఆమె దాన్ని చదువుతున్నట్లు లేదు. ఆలోచిస్తూ వుంది.

"భోజనం చేశావా?" అన్నాడు భానుమూర్తి డ్రస్సు మారుస్తూ.

"ఊఁ" అన్నది జానకి చేతిలోఉన్న పుస్తకం తెరుస్తూ.

"ఇంతరాత్రివరకూ మేల్కొన్నావే! నాకోసం కనిపెట్టుకు కూర్చున్నావా? పుస్తకం చదువుతూ నిద్రపోలేదా? లేక ఏదైనా ఆలోచిస్తున్నావా?" అన్నాడు భానుమూర్తి.

ఆమె ఏం మాట్లాడలేదు. చూపుల్ని అయిష్టంగానే పుస్తకంలోని పేజీలకేసి త్రిప్పింది. 'ఇవ్వాళ యింత ఆలస్యంగా ఇంటికివచ్చారేం?' అని అడగలేదు భర్తను. భానుమూర్తి లుంగీ చుట్టుకొని బనియన్‌తో — ఆమె ప్రక్కన చేరి, "అబ్బో! ఇంతరాత్రి వరకూ చదివితే ఆరోగ్యం చెడిపోదూ! పడుకుందాం" అంటూ లైటు ఆర్పివేశాడు. బెడ్‌లైటు వేశాడు. అస్పష్టమైన కాంతి రిటైర్డు అయిన ఉద్యోగి సత్తువకు మల్లే వెలుగుతూంది.

భానుమూర్తి ఆమె మెత్తని నడుం చుట్టూ చేయివేసి, ఆమె ముఖాన్ని తనముఖం దగ్గరకు లాక్కొని—కళ్ళల్లోకళ్ళు పెట్టి, పెదాల కడకు పెదాలుచేర్చి, "ఏం జానకీ! ఏమంటావు?" అన్నాడు హృదయంలో తియ్యని భావోద్రేకం పరవళ్ళు త్రొక్కుతూండగా.

జానకి కళ్ళు మూసికుంది —వర్షించనున్న మేఘం బరువుగా కదిలినట్లుగా నిట్టూర్పు విడుస్తూ, హఠాత్తుగా మూయబడిన ఆమె నేత్రాంచలాలనుండి రెండు అశ్రుబిందువులు దిండుపై దిగులుగా రాలడాన్ని అతను మసక కాంతిలో చూశాడు.

"జానకీ!" అన్నాడు బిగ్గరగా.

• • •

ఆఫీసు పనిమీద భానుమూర్తి వాల్టేరువెళ్ళి రెండురోజులైంది. ఇంకా రాలేదు. మరునాటి రాత్రికే వస్తానన్నాడు. వెళ్ళేటప్పుడు జానకి అడగలేదు. అతను సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి రాగానే త్వరగా స్నానం చేయటమూ, భోజనం చేయటమూ, బ్యాగులో దుస్తులు సర్దుకోవటమూ, డ్రస్సు వేసికోవటమూ—అన్నీ ఆమె చూస్తూనే ఉంది. కాని 'ఎక్కడికి వెళుతున్నారు?' అని ఆమె అడగలేదు. ఆమె ఎప్పటిలాగే అడుగుతుందేమోనని భానుమూర్తి ఎదురు




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోతున్నదిన్నీ, నీ సరియైన చర్యను గురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి నీవు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోని నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థ యాత్రలు. వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధి నిక్షేపములు, లాటరీ, అకస్మాత్తు ద్రవ్యలాభము మొదలగువానిని గురించి స్పష్టంగా మాసవారీగా వ్రాసి రు. 1—4—0 లకు మాత్రము. వి. పి. గా పంపగలము. వి. పి.చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహము లేమైనా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకం వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయుండి.

**Pt. Dev Dutt Shastri, Raj Jyotishi (A. W. 13) Jullunder City.**

చూశాడు. ఆమె అట్లా అడక్కపోవడం—ఆమె అనూహ్యమైన మార్పులకు గురిఅవుతూన్నదన్న విషయానికి బలవత్తరమైన నిదర్శనం. అంతకు ముందు ఆమె అట్లా ఎప్పుడూ మిన్నకుండేది కాదు. అతనే తీరా స్టేషనుకు వెళ్ళేందుకు రిక్షా పిలిపించాక చెప్పాడు: 'వాల్తేరు పనిమీద వెళుతున్నాను. రేపు రాత్రికి వస్తాను.' అని. ఆమె ఏం మాట్లాడలేదు.

ఆరాత్రినుంచీ వర్షం సన్నగా పడుతూనే ఉంది. ముసురును వెంటబెట్టుకొనే కార్తీక మాసం ప్రవేశించింది. పగలంతా చలిగాలి జోరుగా తల ఆడిస్తూనే ఉంది. జానకి ఎడతెరిపి లేకుండా ఆలోచిస్తూనే ఉంది. సరిగ్గా భోజనంకూడా చేయలేదు. పనిమనిషి బలవంతాన పన్నెండుగంటలకు కొంచెం ఎంగిలి పడింది. కొంతసేపు పడుకున్నది. నిద్రరాదు. కనురెప్పలు మూతబడవు. ఏదో నవల తీసింది—చదువుదామని. కాని చదవలేక పోయింది. ఉత్సాహం వుంటేనేగా, మనస్సు ప్రశాంతంగా వుంటేనేగా! మరికొంచెంసేపు రేడియో ముందు కూర్చున్నది. హిందీ పాటలు వచ్చాయి. కాని ఆసక్తిగా వినలేకపోయింది. ఇంకొంచెంసేపు ఇంట్లోనే పచార్లు చేసింది—బయటపడే వానకేసి చూస్తూ. కాని ఏం లాభం? కాలంలో కదలిక కనిపించలేదు. మనస్సంతా మంచుదట్టంగా పట్టిన ఉదయంవలె ఉన్నది. ఏదో బాధ, ఏదో భయం, ఏదో బలహీనత—ఆమె హృదయాంతస్సుల్లో అరలు అరలుగా పేర్చుకొని, భవిష్యత్తులో చీకటి దృశ్యాల్ని అల్లుకొని జేస్తున్నది. పుట్టింటికివెళ్ళి, తండ్రిద్వారా ఆసంగతులు విన్న దగ్గర్నుంచీ ఆమె మనస్సు గాడి తప్పింది. ఆలోచనల తీరుమారింది., జీవితాన్ని గూర్చి ఏర్పర్చుకున్న స్థిరమైన నమ్మకాలే సడలిపోయ్. తను మోసపోయింది. తన ప్రేమ మోసపోయింది. తన ఆలోచనలు మోసపోయాయి. తన అందమైన కలలు ఘోరమైన పీడకలలుగా మారాయి. తన ఉనికి ఏక్షణంలోనైనా—ప్రమాదపూరితం కావచ్చు. తను భయపడుతూన్న కీడు ఎప్పుడైనా కోరలు తెరుచుకొని కబళించవచ్చు. తన బ్రతుకు అట్లాంటిభద్రతలేని అనిశ్చయస్థితిలో వుంది. గోముఖవ్యాఘ్రం నివసించే గుహలోకి దారితప్పి అమాయికంగా వచ్చిపడ్డ మేకస్థితి వంటిదే తనది. ఆయన్ను నమ్మటం ఎలా? తన జీవితానికి ఆయనే సర్వస్వమని విశ్వసించటం ఎలా? పాలల్లో విషం కలిసిందని తెల్సికున్నాక కూడా ఆపాలుత్రాగడం శ్రేయస్కరమా? తెల్లని సిల్కుగుడ్డ తెరవెనుక నల్లని దృశ్యాలున్నాయని ఎరుకపడ్డాక కూడా ముందుకు నడవటం ఎట్లా? సాధ్యమా! .....

ఆమధ్యాహ్నం వర్షం సెలవు పుచ్చుకోగా—సూర్యుడు సందుచేసికొని కళకళ నవ్వాడు. వరండాలో ప్రేంకుర్చీలోకూర్చుని ఇంటిముందు పూలచెట్లపై బడే తెల్లని ఎండకేసి చూస్తూ కూర్చుంది జానకి. గాలివుండీ లేనట్టుగా వీస్తోంది. కాని ఆప్రకృతి సౌందర్య శోభను మెచ్చుకొనే ప్రశాంత వాతావరణంలో లేదు ఆమె హృదయం. అదే సమయంలో ఇంటి ముందు ఓరిక్షా ఆగింది. ఆరిక్షాలోంచి ఓ యువతి దిగింది. సన్నగా, నాజూగ్గా, అందంగా, — ఉన్న ఆ యువతి విలాసంగా నడుస్తూ ఇంట్లోకొచ్చి — ''భానుమూర్తిగారు ఉన్నారా?'' అన్నది నవ్వాలని చిరనవ్వు నవ్వుతూ.

ఆమెకేసి జానకి అనుమానాస్పదమైన ఆశ్చర్యంతో కొన్నిక్షణాలపాటు చూసి — ''లేరు' అన్నది.

''ఎక్కడికెళ్ళారు?'' అంటూ ఆమె ఎదురుగ్గా ఉన్న మరో ప్రేంకుర్చీలో కూర్చుంది పరిచయస్తురాలివలె.

''వాల్తేరు''

''ఎందుకు?''

''ఏమో!''

''ఎప్పుడొస్తారు?''

''ఏమో!''

ఆయువతి ఇత్తడిపళ్ళెం రాతిమీద జారి పడ్డట్టుగా ఫక్కున నవ్వింది. జానకి ముఖం కోపంతో కుంకుమభరిణి అయింది.

ఆయువతి కుర్చీలోంచి లేచింది వచ్చినపని అయిపోయినట్టుగా. ఆమె ముఖాన ఇంకా హేళనతో కూడుకున్న నవ్వూ, అర్థంకాని నిర్లక్ష్యతా, ఆధారంలేని అధికార స్వభావుకతా, — ద్వారబంధానికి కట్టిన పచ్చితోరణాలవలె వ్రేలాడుతూనే ఉన్నాయి.

''సరే. నేను వెళుతున్నాను. కాని భానుమూర్తిగారు వచ్చాక ఓమారు 'మీకోసం సావిత్రి వచ్చి వెళ్ళింది' అని మాత్రం చెప్పండి'' అంటూ ఆమె వెనక్కి తిరిగి చూడకుండావెళ్ళింది.

జానకి హృదయంలో ఒక్కసారి అగ్నిపర్వతం బద్దలైనట్లయింది. ఎవ్వరీ సావిత్రి? ఆయన గారితో ఏం పని?ఎందుకు వచ్చింది? ఆనవ్వూ, ఆచొరవా, ఆ అధికారమూ, ఆ నిర్లక్ష్యతా— ఆమెకెవరిచ్చారు? పెళ్ళి చేసుకుని సంసారం చేస్తూన్న స్త్రీయేనా యీమె! లేక చల్లని సంసారంలో నిప్పుకణికల్నివెదజల్లటానికి వచ్చిన దుష్టాత్మురాలా? తన భర్తతో ఈమెకు ఎప్పుడ్నుంచిపరిచయం?ఎప్పట్నుంచో లేకుంటేయింత అధికారాన్నీ చొరవనీ ఆమె ఎట్లా సంపాయించగలదు? ఆరోజు ప్లాట్‌ఫారంమీద ఆయనగారితో మాట్లాడిన స్త్రీకాదు. ఈమె మరోకామె. ఏమో! తనకేం తెలుసు!—ఆయన గారికెంత మంది ప్రియురాండ్రు ఉన్నారో? 'మీకోసం సావిత్రి వచ్చి వెళ్ళింది' అని తనని చెప్పమన్నది. తను ఇంట్లో వుండగా, తనభర్తకోసం పరాయి స్త్రీ రావటమా? ఆయన గారితో ఆమెకు ఎంత దగ్గర సంబంధం, ఎంత బలీయమైనపూర్వ పరిచయం, ఎంతగాఢమైన మమతా లేకపోతే అట్లా అనగలుగుతుంది—తన ఎదుట? ఆయన గారికి ఇట్లాంటి స్త్రీలలో ఎంతమందితో సంబంధమున్నదీ తనకి తెలీదు. తరుచూ వాల్తేరూ, రాజమండ్రీ, హైద్రాబాదూవెళుతూ వుంటారు. ఆఫీసుపనిమీదనా లేక పాత ప్రియురాళ్ళను కల్సికోవటానికా! తను వంచించ బడింది. ఆయన ఆశయాలూ, ఆయన సౌందర్యారాధనా, ఆయన ప్రవర్తనా— తనవూహాలోని మంచి తనానికి పోలినవికావు. ఆయన్ను గురించి తను ఖాయపర్చుకున్న అభిప్రాయాలూ,ఆయనమీద తను పెంచుకొన్న విశ్వాసపు వృక్షమూ, ఆయన బ్రతుకు నీడలో తన బ్రతుకు వెలుగుకోసం పడ్డ తాపత్రయమూ— అన్నీ గాలి మేడలు! ఆయన సౌందర్యారాధన అంతా బూటకం. నీతి మాలినది. ఆయన మనస్సు జారుడునేలవంటిది. ఆయన హృదయం పీఠభూమి. ఆయన జీవితంలోని ఆదర్శం అడుగు లేని పాత్ర వంటిది. నీతికి ప్రాధాన్యతలేని ఆదర్శంతో ఏజీవితం అభివృద్ధిలోకి వెళ్ళగలదు? సౌందర్య ఆరాధన పేరుతో, ఆదర్శంతో—నీతిని లక్ష్య పెట్టకుండా కట్టుకున్న భార్య హృదయపు కోతను గమనించకుండా, వ్యక్తిత్వ ప్రకాశపు ఆత్మవంచనతో ఆయనగారు ఎన్నాళ్ళు అపవిత్రపు జీవితాన్ని గడుపుతారు? ఆయనగారు భ్రమించే సౌందర్యమంతా—ఆయనగారు కళ్ళు కల్పించుకుంటూన్న మాయాజాలమేగాని, వాస్తవమైనది కాదు. పరిసరాల్ని విస్మరించి, సామాజిక నీతిని తృణీకరించికామప్రేరేపణగలఆదర్శాన్ని జీవితంలో ప్రధానాంశంగాపెట్టుకొని—ఆచరణద్వారా పెంపు చేసికొంటూన్న యీ అజ్ఞాత పాపానికి ప్రాయశ్చిత్తం పొందేరోజు రాకపోతుందా?.... సాయంత్రము సాగిలబడేవరకూ జానకి ఆ కుర్చీలోనే కూలబడి ఆవిధంగా ఆలోచనల గొలుసును పొడిగించింది.

ఆరాత్రి తొమ్మిది గంటలకు మెయిల్లో భానుమూర్తి వాల్తేరునుంచి వచ్చాడు. అప్పటికి జానకి భోజనం చేయలేదు. పనిమనిషి స్నానానికి నీళ్ళుతోడగా స్నానంచేసి, ఆతర్వాత భోజనం చేశాడు భానుమూర్తి.

''ఏమిటి విశేషాలు?'' అన్నాడు భానుమూర్తి భార్యతో సిగిరెట్టు వెలిగిస్తూ.

జానకి ఏం మాట్లాడలేదు. సావిత్రి అనే ఓ యువతి ఆయనకోసం వచ్చి వెళ్ళినట్టు చెప్పలేదు. చెప్పదల్చుకోక కాదు. కాని చెప్పలేదు.

• • •

జానకి పరిస్థితి రానురాను ఆందోళనకరంగా ఉంది భానుమూర్తికి. ఆమెలో మానసికంగా, శారీరకంగా వస్తూన్న మార్పుల్నీ, ఆమార్పుల ఫలితాల్నీ అంచనవేయలేక పోతున్నాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ మూగవేదనపడుతూ, జీవితం దుఃఖమయం కానున్నట్టు భయపడుతూ వుంటుంది. పరిసరాలమీద శ్రద్ధ

రవ్వంతలేదు. ఉదయమూ, సాయంత్రమూ, పగలూ, రాత్రీ—అన్న విచక్షణతో కూడా నిమిత్తము లేకుండా దిగులుతో దురపిల్లుతూ వుంటుంది. కాని ఆమె దుఃఖానికి హేతువు, భయానికి కారణం, పరిసరాలమీద ఆమెకు అట్లా నిర్లక్ష్యత ఏర్పడటానికి దారితీసిన సంఘటనలు—భానుమూర్తి వూహాపథంలో నిలబడ లేకపోతున్నాయి— కాని ఒకటిమాటుకు చూచాయగా గ్రహించగల్గాడు. తనమీద జానకికి ఏదో దురభిప్రాయం గాఢంగా ఏర్పడి వుండి వుంటుందని. అందుకే ఆమె మానసిక ప్రపంచంలో ఇంత కల్లోలం, ఆమె ఆరోగ్య పరిస్థితిలో ఇంత అధ్వాన్నం! అది ఎట్లా ఏర్పడిందో, ఎవ్వరిద్వారా ఏర్పడిందో, ఎందుకు ఏర్పడిందో—తనకు తెలీదు. అదీ కేవలం అపోహ,




హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

అనుమానపు దుర్గంధం. తనని అర్థంచేసికోవడం పూర్తిగా వక్రమార్గాన్ని అవలంబించడం. జానకి ఇంత సులభంగా మృగతృష్ణలాంటి అనుమానపు పీడల్లోకి దిగజారి తనపైన విశ్వాసానికిరాలేనామూ ఉంటుందని భావించలేదు. ఆమె హృదయం అరకులో ఉంటుందని గ్రహించలేక పోయాడు. ఆమె అపురూప లావణ్యంతో ఆమె హృదయ నైర్మల్యతను అంచనా వేసికున్నాడుగానీ—అది కేవలం నర్మదానదిని పోలినదని వూహించలేక పోయాడు. ఆమె వ్యక్తిత్వపు లోతుల్లో మంచినీరు వుంటుందని భ్రమించాడు. కమల రూపు రోత కలిగించినా మనస్సుమట్టుకు నవనీతం. తనని గురించి అహర్నిశమూ మంచినే దృష్టిలో పెట్టుకొనేది. కాని జానకి మనః ప్రవృత్తులు అట్లాంటి విశాలదృష్టికి అలవాటుపడ్డట్టు లేవు. తనుఆమెను పరిపూర్ణ హృదయంతో ప్రేమిస్తున్నాడు. మొదటిభార్య కమలను ప్రేమించలేదని తను ఒప్పుకుంటాడు. కమల తనని సుఖపెట్టటానికి ఆమె బ్రతికినంతకాలమూ ప్రయత్నించింది. కాని ఆమె కృతకృత్యురాలు కాలేక పోయింది. ఆమె అందవిహీనత ఆమెపట్ల తన హృదయాన్ని, అభిమానాన్ని, ప్రేమను అటుమరల్చలేక పోయింది కాని జానకిని ప్రేమిస్తున్నాడు. కారణం జానకి తన ఆదర్శ శిఖరాలకు అనువైన గొప్పసౌందర్యవతి కావడమే. ఆమె అందంయొక్క గొప్పదనం తన హృదయంలో గట్టిగా నిలబడిపోయింది. ఎట్టిపరిస్థితుల్లోనూ దానికి తను గౌరవాన్నే చేకూర్చుతాడు గానీ ద్రోహంతలపెట్టడు. తను గ్రహించినది దురదృష్టవశాత్తూ వాస్తవమే అయితే—ఆమె హృదయంలోనుంచి ఆదురభిప్రాయాన్ని కూకటివేళ్ళతో తొలగించాలి. మనస్సు కల్పించుకున్న మాయమబ్బుల్ని పారద్రోలాలి. అప్పుడుగానీ ఆమెమనస్సు దారికిరాదు, తమ దాంపత్యం బాగుపడదు. సంసారంలో చెలరేగిన తుపాను సమసిపోదు. మనస్సు ఆనందంగా వుంటేనే బ్రతుకులో అందం. ఆఉద్దేశ్యంతోనే భానుమూర్తి ఆమెను నిష్కర్షగా అడిగాడు:

"జానకీ! రోజు రోజుకీ నీపరిస్థితి చూస్తుంటే నాహృదయంలో నల్లని మబ్బులు ఆకాశాన్ని మూసివేస్తున్నట్టు విపరీతమైన భయాలు అల్లుకొని పోతున్నాయి. మన ఇరువురి మనస్సుల్లో ఇట్లాంటి అగాధమూ, భయపు వాతావరణమూ, అర్థంగాని పరిణామమూ — పెంపొందటానికి కారణాలేమిటి? మన ఇద్దరి హృదయాల్లోనూ అనిశ్చితాలైన కొన్ని భేదాభిప్రాయాలు గూడు కట్టుకోవటానికి ఆజీలుగా ఉన్నాయి. అవి స్థిరపడి పోకముందే—మన మనసుల్ని మూసివేయనున్న మబ్బుల్ని పారద్రోలడం శ్రేయస్కరం. ఇరువురి హృదయాల్ని తుడిచిన అద్దాలవలె పెట్టుకుందాం. చెప్పు.నాప్రవర్తనలో, నాచేష్టల్లో, నా ఆత్మలో—నీమనస్సుని లోపాలేమైనా ఉన్నాయేమో సరిదిద్దుకుంటాను.నీమీద నాకున్న ప్రేమ నన్ను ఏక్షణంలోనైనా మార్పుకి గురిచేసికోగల పటుత్వాన్ని ప్రసాదిస్తుంది. అర్ధాంగిగా, జీవితంలో భాగస్వామినిగా భర్త లోపాన్ని ఎత్తిచూపి, వాటికి తగిన మార్గాలను సూచించేహక్కు భార్యకున్నది. ఆమె ఆహక్కును ఉపయోగించుకోవటం అధికారాన్ని చెలాయించడంకాదు. భార్య సూచించే సన్మార్గాలనుభర్త స్వీకరించటం ఆత్మవిశాలతనూ, సహృదయతనూ తెలియజేస్తుందిగానీ లొంగుబాటునూ, దాస్యత్వాన్ని తెలియజేయదు. నా బ్రతుకుబాటలో గతుకుల్ని నువ్వు బాగుపర్చే సాధనం కావటం నాకు సంపూర్ణంగా సమ్మతమే. చెప్పు నిన్ను బాధించే, యీ అంతులేని ఆవేదనను గురిజేసే నాబ్రతుకు బాటలోని గతుకులేమిటి? అవి ఏవిధంగా బాగుపడగలవు."

కాని జానకి ఏం మాట్లాడలేదు. పైపెచ్చు ఆమెముఖం నిండిన తటాకం నిద్రపోతూన్నట్టు ప్రశాంతంగా ఉంది. కాని ఆమె హృదయంలో వివిధ భావాల విపరీత సంఘర్షణ తాలూకు వేడిమి పొగలు గ్రక్కుతూనే ఉంది. ఆమె మౌనం అతనిమనస్సును చీకటిగదివలె మార్చింది. ఆచీకటి గదిలో భవిష్యత్తు మీద వాలటానికి ఆజీలుగా వున్న నిరాశ, నిస్పృహ, ఆవేదన, భయం— తారట్లాడసాగాయి.

ఒకరోజున సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వస్తూ వస్తూ డాక్టర్ని తీసికొచ్చాడు భానుమూర్తి. భార్యను చూపెట్టాడు. డాక్టరు పరీక్షచేసి ఇంజక్షను ఇచ్చి, ప్రిస్క్రిప్షన్ వ్రాసి యిచ్చాడు. వెంటనే భానుమూర్తి ఆ మందుల్ని తెప్పించాడు. డాక్టరు రోజూ వచ్చి చూస్తానన్నాడు. ఒకపదిహేనురోజులపాటు ఇంజక్షన్లు ఇవ్వాలన్నాడు. రోజూ పళ్ళరసం త్రాగటం అవసరమని చెప్పాడు. రోగిమనస్సు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండాలన్నాడు.

జానకికి ఇదంతా తుప్పుపట్టిన వస్తువుకు రంగు పూస్తున్నట్టుగా వుంది. ఆమె మందుత్రాగడంలేదు. ఆమె మానసికస్థితిలోనూ, శరీరంలోనూ ఏమీ మార్పు రాలేదు. ఆమెలోని శూన్యదృక్కులూ, అవ్యక్తమైనభయమూ, కలత నిద్రలాంటి ఆలోచనలో ఏమీ పట్టించుకోని ప్రత్యేకతా—కొనసాగుతూనే ఉన్నాయి. కాని భానుమూర్తి మనస్సులో ఆందోళన గావుకేకలు పెట్టనారంభించింది. ఒకరోజు రాత్రి ఎనిమిది గంటలకు—

"మందుత్రాగావా?" అన్నాడు భార్యతో.

"ప్చ్" అన్నది జానకి.

"ఎందుచేత"?

ఆమెనుంచి సమాధానం లేదు.

భానుమూర్తి స్వయంగా ఔన్సుగ్లాసులో మందుపోసి భార్యచేత త్రాగించాడు.

ఇదంతా వాస్తవమైన ప్రేమేనా? తన ఆరోగ్యాన్నిగూర్చి ఆయనపడేఆదుర్దా, భయమూ, జాగ్రత్త—ఆయన అంతరాత్మకు సంబంధించినవేనా? తెచ్చిపెట్టుకొన్నవా? తనని నిజంగా ఆయన ప్రేమిస్తున్నాడా? తనమీద నిష్కల్మషమైన ప్రేమవుంటే అట్లాఎందుకు ప్రవర్తిస్తాడు? ఆయనగారికి మొదటిభార్యమీద లేని ప్రేమాభిమానాన్ని తనమీద చూపెట్టాల్సిన ఆవశ్యకత—నిజంగా తన అందచందాలే కారణాలా? సౌందర్యోపాసన ఆయనగారి జీవితాదర్శమైతే తనలో ఆయనకు నచ్చిన యీ సౌందర్యం ఏకారణంచేతనైనా ఏజబ్బువల్లనైనా కుంటుబడితే అప్పుడు తన మీదున్న యీ ప్రేమాభిమానాలూ, మమతా తనంటే పడిచచ్చే గాఢమూ జారిపోతాయా? తనమీద ద్వేషం జుగుప్స, కోపం వికారం—ప్రజ్వరిల్లుతాయా? తనూ కమలవలె భర్త ప్రేమను పొందలేని దౌర్భాగ్యురాలు అవుతుందా? తనకీ కమలకు పట్టిన గతి పడుతుందా? తనబ్రతుకులో దురదృష్టం కన్నీరు కారుస్తుందా? ఏమో!..... భవిష్యత్తులోని వెలుగుబాటకు భద్రత ఏముంది? రోడ్డుమీది ఎత్తు పల్లాల్లాంటి సుఖ దుఃఖాల సమ్మిశ్రితమైన యీ జీవితంలో—ఏక్షణంలో విధి అనుకూలించకపోతే ఆక్షణంలో అదృష్టం బోర్లాపడవచ్చు. స్త్రీఅందం, ఆకర్షణ, లావణ్యం పర్వతాలూ, సముద్రాలవలె శాశ్వతమైనవా? గులాబిపువ్వు తరుణంలో బాగా వికసించినప్పుడే అందంగా కనబడుతుంది. ఆకర్షింపబడుతుంది. కాని ఆ అందం ఆకర్షణ పేశలత్వం మరుసటి రోజుకు మాసిపోవడంలేదూ! అప్పుడు వాడిపోయిన గులాబీపువ్వుమీద యీసౌందర్యోపాసకుల దృష్టిలగ్నమవుతుందా? వాడిపోయిన గులాబీ దుర్గతిని మెచ్చుకొనే విశాల హృదయం యీ సౌందర్యోపాసకులకుంటుందా? శాశ్వతమైన అందాన్ని ఆరాధించే ఆయనగారు అశాశ్వతమైన సౌందర్యాన్ని కలిగియున్న తనని ఎంతకాలం ప్రేమిస్తాడు? స్త్రీ హృదయంమీద స్త్రీ మనస్సుమీద స్త్రీ విశాలదృష్టిపైనా— అభిప్రాయమూ, ఔన్నత్యమూ, అభిమానమూ లేని భర్తను నమ్ముకొని తను ఎంతకాలం ముళ్ళదారిలో మల్లెపువ్వుల్ని వూహిస్తూ జీవితాన్ని ముందుకు నెట్టగలదు? ఆయనగారి ఆదర్శాలు ఆకాశంలోని నక్షత్రాలైతే ఆమసక కాంతిలో తన బ్రతుక్కి పరిపూర్ణమైన వెలుగు ఎప్పుడు? తన జీవితానికి ఆవేదనే గాని ఆనందం లేదు. ఆవేదన వెనుక ఆనందం వుంటుందని తను తలపోయడం కేవలం పొరబాటు.

"ఇదిగో జానకీ! నువ్వు ఇట్లా ప్రతిరోజూ మందుత్రాగకుండా అశ్రద్ధ చేస్తుంటే—నేను ఆఫీసుమానివేసి ఇంటిదగ్గరవుండి నీ ఆరోగ్యం బాగుపడేందుకు ప్రయత్నిస్తాను. చెప్పు ఉద్యోగానికి రాజీనామా ఇమ్మంటావా? లేక యీలేని పోని ఆలోచనల్ని మాని సక్రమంగా మందుత్రాగి శరీర సౌందర్యాన్ని కాపాడుకుంటావా?" అన్నాడు భానుమూర్తి తాత్కాలికమైన ఆవేశంలో.

జానకి మెల్లిగా నవ్వింది. ఆనవ్వులో నిశీధిలు తెల్లమొహం వేశాయి.

అదే ఆయనగారి బాధ, ఆదుర్దా, భయమూ

తను మందు త్రాగకపోతే, తను ఆలోచనలతో మనస్సుకు మురికి పట్టించుకుంటే — శరీరం చిక్కిపోతుందనీ తద్వారా తనలో అందం క్షీణించిపోతుందనీ తనని ద్వేషించాల్సి వస్తుందనీ! ఎంతస్వార్థం ప్రేమలో ఎంత పక్షపాతం? మెప్పులో ఎంతవేడి?

"ఏమండీ". అన్నది జానకి నెమ్మదిగా.

'ఆ! అన్నాడు భానుమూర్తి భార్య ఏదో చెప్పేందుకు సంసిద్ధురాలైనందుకు సంతోష పూర్వకమైన దరహాసంతో.

"ఒక ప్రశ్న అడుగుతాను సూటిగా సమాధానం చెబుతారా?" అన్నది జానకి వేదనాపూరితమైన సందేహంతో,

"చెబుతాను, ఒక ప్రశ్నేమిటి! లక్ష అడుగు. చెబుతాను. నీసంశయాత్మ నిర్మూలం కావాలనే నా తహతహ. ఊపిరి సల్పుకోలేని అనిశ్చిత స్థితిలో ఉన్న నీహృదయానికి మంచిగాలి చేకూర్చాలనే నా తలంపు. అడుగు జానకీ ఆ ప్రశ్న ఏమిటో!"

నీళ్ళు నిండిన కళ్ళతో భర్తకేసి చూసింది. గొంతులో దుఃఖం ఆనకట్ట కట్టబడింది. జానకి ఏమీ మాట్లాడలేక పోయింది. అడగదల్చుకున్న ప్రశ్న అంతరాత్మను అంటుకొనిపోయి, బయటకు రాలేదు. నీళ్ళు నిండిన కళ్ళు ఒక్కసారి వర్షించాయి.

భానుమూర్తి నిర్ఘాంత పోయాడు.

• • •

"ఆఫీసు పనిమీద హైదరాబాదు వెళుతున్నాను. నాలుగు రోజులవరకూ రావటానికి వీలుకాకపోవచ్చు. జాగ్రత్తగావుండు జానకీ! వేళకు మందూ, పళ్ళరసమూ, హార్లిక్సూ, భోజనమూ తీసికొంటూవుండు. అసలు యీ ప్రయాణం మానివేసేందుకు ప్రయత్నించాను. కాని మేనేజరు పత్తిడివల్ల వెళ్ళక తప్పడంలేదు. సాధ్యమైతే వెళ్ళినపనిఅయిపోతేమూడోనాటికే తిరిగివస్తాను." అన్నాడు భానుమూర్తి ఆరోజు సాయంత్రం జి.టి. ఎక్స్‌ప్రెస్సులో హైదరాబాద్ వెళ్ళబోతూ.

ఆఫీసుపనిమీదా లేక స్వంత పనిమీదా? ఇంకా ఆయన తల కళ్ళకు నల్లగుడ్డ గంతకట్టి యథేచ్ఛగా సంచరించాలని చూస్తాడు. తను కావం లేనేనా! తన హృదయంలో ఇంకా గొప్పగా వుండాలనీ తను ఎంత అవినీతికి పాల్పడినా భార్య మనస్సులో పవిత్రతనూ, పరువు ప్రతిష్ఠల్నీ కోల్పోగూడదనీ—ఆయన పట్టుదలకానోసు!— ఆభావన మనస్సులో తేలినా, కలిగానే నిశ్శబ్దంగా నవ్వుకుంది జానకి.

మునిమాపు ముగిశాక, చీకటి పిక్కటిల్లి మంఖానికి కాటుక రాసుకుంది రాత్రి.

జానకి కొంచెంగా ఎంగిలిపడి పనిమనిషికి వంటింటి సర్దమని చెప్పి — లేడీచైరులో కూర్చుంది. హాల్లోకి ఎవ్వరో వచ్చినట్లు చప్పుడై వెంటనే కుర్చీలోంచి లేచి హాల్లోకి వచ్చింది.

ఓ మధ్యవయస్కుడైన వ్యక్తి చెప్పులు గోడ ప్రక్కన విడిచి సంచి వంకెకు తగిలించి, ఎంతో స్వతంత్రంగా కుర్చీలో కూర్చున్నాడు. లాల్చీ, పంచె ధరించాడు. కళ్ళకు జోడు ఉన్నది. పల్లెటూరి వ్యవహారవేత్తవలె ఉన్నాడు. అతన్ని చూడగానే పోల్చుకోలేక పోయింది జానకి. ఆయనగారి బంధువేమో ననుకొంది. అంతకు ముందు ఆమె ఎన్నడూ చూసియుండలేదు.

"భానుమూర్తి లేడూ" అన్నాడా వ్యక్తి హాల్లోకి వచ్చిన జానకికేసి ఎగాదిగా చూస్తూ.

"లేరు. హైదరాబాదు వెళ్ళారు...." అన్నది జానకి ఏదోనేరం చేస్తున్నంత బెరుకుదనాన్ని కనబరుస్తూ.

"ఎప్పుడొస్తాడు"?

"రెండుమూడు రోజుల్లో—"

ఆవ్యక్తి 'ఓ హో! అలాగా! అన్నట్లు తల ఆడించాడు. జేబులోంచి చుట్ట తీసి తాపీగా వెలిగించాడు. జానకికి ఏమీ అర్థంగాక ఆ హాలులోనే అతనికి గజం దూరంలో నిలబడింది.

"మీరేనా భానుమూర్తి ద్వితీయ కళత్రం..' అన్నాడు ఆవ్యక్తి ఆమెకేసి వ్యంగ్యంగా నవ్వుతో.

ఆపోటుదనపు వాక్యం ఆమె హృదయంలో పదునుగా గ్రుచ్చుకుంది. ఆయన ధోరణి నవ్వులూ, చూపులూ ఆమెని అయోమయపు వూబిలో దించాయి.

"నా ధోరణకు గాబరాపడకండి. నేను భానుమూర్తి మొదటిభార్య అన్నను. మాచెల్లెలు చనిపోయినప్పటికీ అప్పుడప్పుడు యీవూరు పనివుండి వచ్చినప్పుడల్లా వచ్చి పోతుంటాను. హైదరాబాదు వెళ్ళాడన్నమాట. ఏదైనా పనివుండి వెళ్ళాడా! ఆఫీసుపనా! స్వంతపనా!...బహుశా మీకింకా చెప్పివుండడు లే. వారానికోమారు కులాసాగా వెళ్ళేఅలవాటుగలవాడు, ప్రతిసారిభార్యతో ఎక్కడ నిజం చెబుతాడు? మాకమలి బ్రతికి వుండగా— ఏవూరు వెళ్ళినా, ఎప్పుడు వచ్చినా ఆమెతో చెప్పేవాడుకాదు. అసలు ఆమె తెగించి అడిగేది కూడా కాదు. ఆమె దాంపత్యం దుఃఖాంతమైన విషాదచిత్రమనుకోండి. ఏమో ఆదర్శాలంటూ, సౌందర్యారాధన అంటూ, ఆమె జీవితాన్ని నరకం చేసి నాశనం చేశాడు. ఏదో చదువుకున్నవాడనీ, ఉద్యోగం చేస్తున్నవాడనీ ఆశపడి—పిల్లనిచ్చి, దాని గొంతుమీదేసేశాము. జీవితంలో ఏఆదర్శమైనా, కర్తవ్యాన్ని మరపింప జేసి, వ్యక్తిత్వాన్ని కలినపర్చి ఎదుటవారి జీవిత నాశనానికి కారణభూతం కారాదు. మనం జీవితంలో ఏర్పరచుకొన్న ఆదర్శాలు ఎప్పుడూ ఇతర్లకు బాధాకరంగానూ, ఇతర్ని వంచించి బలిగోరేవి గానూ వుండరాదు. పోనీలెండి. అదంతా విషాదం పొంగి పొర్లిన గతం. ప్రస్తుతం భానుమూర్తి ఆదర్శాల నీడలో మీ బ్రతుకు భాగ్యమేమిటి? మీరు ఆశించిన సుఖాన్ని ఆయనవద్దనుంచి పొందుతున్నారా? మిమ్మల్ని చూడగానే చూడవచ్చు లెండి. ఎందుకంటే మీరు అందమైన వారు. మాకమలి అంత అందమైనది కాదు. అందమైన వస్తువుల్ని ప్రేమించడం, అభిమానించడం ఆయన జీవితాదర్శంకదా! వచ్చిన ప్రమాదం ఎక్కడున్నదంటే అందమైన భార్యను కూడా అందమైన వస్తువులాగ చూసే దృష్టికి ఆయన అలవాటు పడివుండాల్సింది కాదు. ఎందుచేతంటే అందమైన బొమ్మను కొని ఇంట్లో అమరిస్తే అది పగిలిపోతే—ఇంకొకటి తీసికొనిరావచ్చు. కాని భార్యవిషయం అలా కాదుగా!...... ఏమంటారు?"

ఆమాటలకు జానకి దిగ్భ్రమతోంది, నిలువుగా నిలబడిపోయింది.

తర్వాత పనిమనిషి కాళ్ళకునీళ్ళు అందివ్వగా అతను కాళ్ళు కడుక్కొని, భోజనం చేసి, తన కొరకు అమర్చిన పక్క మీద పడుకొని దిట్టంగా నిద్ర పోయాడు.

కాని జానకి మాత్రం ఆరాత్రి నిద్రపోలేదు. భర్త మీద తన అనుమానాలకి, దురభిప్రాయాలకు అగ్ని మీద ఆజ్యం పోసిన కమల అన్నగారి మాటలు ఆమె హృదయంలో ఎడ తెరిపిలేని వ్యథకు గురిచేసినై. ఆమె తెల్లవార్లూ అలో చిస్తూనే ఉంది.

మరునాడు ఉదయం కాఫీ త్రాగాక తనదార్ని తాను వెళ్ళాడు కమల అన్నగారు.

భానుమూర్తి హైదరాబాద్ నుంచి మూడో నాటికి వచ్చాడు. అప్పటికి జానకి పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారైంది. ఆమెను చూడగానే భానుమూర్తి నిర్విణ్ణుడైనాడు. ఇరవై ఒక్క లంఖణాలు చేసిన టైఫాయిడ్ రోగివలె ఉంది. శరీరం చిక్కిపోయి, కళ్ళు బాగా లోతుకు పోయి, నీరసం హెచ్చి— మృత్యుద్వారంలో పడే సౌందర్యం ఎండవలె పాలిపోయివుంది.

భానుమూర్తి వెంటనే డాక్టర్ని తీసి కొచ్చాడు. ఎక్సురే తీయాలన్నాడు డాక్టరు. మరునాడుఎక్సురే తీశారు. కడుపులో ఏదో పుండు ఏర్పడినట్లుగా వుంది. ఆపరేషను చేయడం మంచిదన్నాడు డాక్టరు.

భానుమూర్తి గుండెలో భయంపీక దిగింది.

కాని జానకి మాత్రం హాయిగా చిరునవ్వే నవ్వింది. జీవితంమీద ఆమెకు అంత నిర్లక్ష్యం ఎందుకో అతనికి అర్థం కాలేదు.

"ఆపరేషన్ చేస్తే మాత్రం కడుపులోపుండు నయమవుతుందా? అది నయంకాని జబ్బు" అన్నది జానకి.

ఆమాటలకు భానుమూర్తి నిలువెల్లా కృంగి పోయాడు.

"జానకీ! నువ్వు అంత అప్రయత్నంగా అధైర్యంగా మాట్లాడితే ఎట్లా? రోగి హృదయం అధైర్యంతో నిండి వుంటే రోగం ఎట్లా నయమవుతుంది? నీమీద పెంచుకున్న నా ఆశలు, ఆశయాలు కలలు ఏంకాను? నిన్ను ఆరాధించే నా బ్రతుకు ఏం కాను? ధైర్యంగా వుండు జానకీ. ఆపరేషను జరిగాక—నువ్వు మామూలు మనిషివి అవుతావు. నీఆరోగ్యం కుదుటబడుతుంది. పూర్వపుటందం లావణ్యం, మృదుత్వం మళ్ళీ నీలో వెలకొనబడతాయి."

నాన విషాద రేఖలు గూడు కట్టుకుని వున్న కళ్లను పైకెత్తి భర్తకేసి చూసింది జానకి.

''ఒక ప్రశ్న అడుగుతాను. సూటిగా సమాధానం చెబుతారా?'' అన్నది జానకి పేలవంగా.

''అడుగు జానకీ! భయమెందుకు? బిడియమెందుకు ఇదివరలో ఓసారి అడుగుతానని అడగలేదు. అడుగు జానకీ! సందేహమెందుకు?'' అన్నాడు భానుమూర్తి ప్రోత్సాహిస్తూ.

కాని జానకి ఆ ప్రశ్న అడగలేక పోయింది. దుఃఖాన్ని గొంతులో సమాధిచేసి, కనుకొలుకుల్లోని నీటిని నొక్కిపట్టి, 'ఏమీ లేదులే' అన్నట్టు బాధామయమైన తెచ్చి పెట్టుకున్న చిరునవ్వు నవ్వింది.

భానుమూర్తి విషణ్ణుడైనాడు.

జానకికి ఆపరేషను చేసే రోజు నిర్ణయించబడింది. ఆ రోజు ఇంకా వారం వుండగానే డాక్టరు ఆమెకు ప్రత్యేకంగా ఇంజెక్షన్లు ఇవ్వనారంభించాడు. భానుమూర్తి పదిహేను రోజులపాటు ఆఫీసుకు సెలవు పెట్టాడు. జానకి తలిదండ్రులకు ఆపరేషను విషయమై లేఖ వ్రాశాడు. వాళ్లు మరునాటికే ఆదుర్దాపడుతూ వచ్చారు.

తెల్లవారితే ఆపరేషను చేసే రోజనగా జానకిలో ఆరాత్రినుంచే భయపు పొరలు దట్టంగా అల్లుకొనసాగినవి. అనుక్షణమూ గుండె క్రిష్ణా బ్రిడ్జి మీద జి. టి. ఎక్స్‌ప్రెస్ పోతున్నట్టు దడదడకొట్టుకుంటూనే ఉన్నది. ఒక ప్రక్క బ్రతుకుమీద వాంఛలేక పోవడమూ, మరో ప్రక్క తను యీ స్థితికి దిగజారడంలోని సమంజసాన్ని తర్కించు కోవడమూ! తను కేవలం నిజానిజాల ఎండమావుల్లో తారట్లాడుతున్నదేమో! తను భర్తనుంచి ఏం కోరుకున్నది? అది తను ఎందుకు పొందలేక పోయింది? తాను పొందలేక పోయాననే న్యూనతా భావమే కేవలం తనలో పనిచేస్తున్నదేమో! తనపైన నిజంగా భర్తకు ద్వేషం ఉన్నదా? తనని నమ్మించి, మోసం చేస్తున్నాడా? తనకు తెలీని తెరవెనుక జీవితం ఆయన గారికున్నదా? ఇన్నాళ్లూ తను కేవలం అపోహలతో, అపార్థాలతో, అనుమానాలతో, తప్పుడు అంచనాలతో, కృత్రిమమైన భయపు వాతావరణంలో బాధపడుతూ, ఆయనపై ద్వేషాన్ని పెంచుకుంటూ యీ దుస్థితిని కొని తెచ్చుకుందేమో? ఆయన గారి గత జీవితాన్ని శకించి, అందులో తొంగి చూడ ప్రయత్నించి— తన బ్రతుకు బాటలో తనే నిప్పులు గుమ్మరించుకున్నదేమో!.. తను సాధించిందేమిటి? రేపు ఆపరేషనులో కర్మంచాలక తను మరణిస్తే—అదేనా తను సాధించేది? అందులో ప్రయోజనమేముంది? బ్రతుకులో అనవసరంగా భయంకరపు నీడను కల్పించుకొని, ఆనీడను చూసి పిరికిగా బెదురుతూ, జీవితాన్ని ముగించడం ఏం సబబు? ఆయన ప్రవర్తనలో చెడు యొక్క రూపాన్ని యింతకాలమూ వూహించుకుంటూ వస్తున్నది కానీ నిజాన్ని తను చూసిందా? లేదు. మరి తన తండ్రి అట్లా చెప్పాతేం? మొదటి భార్యను...ఏమో! ఆయనకు మటుకేం తెలుసు? లోకంలో వాడుకను బట్టి ఆయన అట్లా అన్నాడేమో! లోకంలో వాడుకకూ, వాస్తవానికీ దూరం ఉండరాదని ఎక్కడున్నది?...నిజంగా తన భర్త మంచివాడేనేమో! తనని హృదయపూర్వకంగానే ప్రేమిస్తున్నాడేమో! ఆ ప్రేమలో రవ్వంత కల్మషం, మోసం, స్వార్థం కూడా లేదేమో... ఇంత కాలమూ తను వాస్తవానికి స్థానం లేని మనస్సుతో ఆలోచిస్తున్నదేమో! అయినా ఇప్పుడు తను పశ్చాత్తాపపడి మటుకు ప్రయోజనమేముంది? మనః కల్పితమైన అనుక్షణ క్లేశంతో గూడు కట్టుకొనికడుపులో వుండగా తయారైన దుఃఖం— ఎట్లా కరగి పోతుంది? ఆపరేషన్ చేయాలి. ఆపరేషన్‌లో—తను బ్రతుకుతుందని నమ్మకం ఎట్లా?... తను ఆయనగార్ని ముఖాముఖాన అడిగి తెల్సుకొనవల్సింది. ఆయనగారు కూడా తన మనస్సులో కుట్ర పన్నుతూన్న మాయ మబ్బుల్ని తొలగించటానికిసుముఖంగానే ఉన్నారు. కానీ ఇన్నాళ్లనుంచీ తనెందుకు అడగలేదు. అడగటానికి ప్రయత్నించింది. కానీ అడగలేక పోయింది అది తన బలహీనత. తన అనుమానాలకి ఆయన ఏవగించుకుంటాడేమోనన్న భయం — తనచేత అట్లా అడిగించి యుండలేదు. తన మనస్సును యిన్నాళ్లూ మురుగు కాలువవలె మార్చిన ఆ సందేహాన్ని తీర్చుకోకుండానే తను జీవితాన్ని విషాదాంతంగా చాలించాల్సి వస్తుందా? ఈ ఆఖరిదశలో తను ఏంచేయగలదు? తనుచేసిన పాపానికి తను ప్రాయశ్చిత్తం కోరుకున్నా — భగవంతుడు క్షమించవద్దూ!

భానుమూర్తి నిద్రపోతున్నాడు.

గదిలో లైటు దురదృష్టజీవి బ్రతుకులో విషాదంకుమల్లే వెలుగుతూనే ఉంది. బయట చీకట్లో వాతావరణం నిశ్శబ్దంగా నిలుక్కుపోయింది.

మనస్సులో ఏదో ఓ తలంపు చీకట్లో అగ్గిపుల్ల వెలిగించినట్లుగా మెల్కొనగానే జానకి మంచంమీద నుంచి లేచి టేబుల్ దగ్గరకు వచ్చింది. కుర్చీలో కూర్చున్నది. టేబుల్లోంచి రైటింగు ప్యాడ్ తీసి ఏదో వ్రాయ సంకల్పించింది. పదిహేను నిముషాలపాటు ఆలోచించింది. కాగితం మీదకు కలం అడుగుపెట్టలేదు. మనస్సు బరువుగా వుంది. ఆలోచనలు గజిబిజిగా ఉన్నాయి. చేతులు వణుకుతున్నాయి. గబగబా రైటింగు ప్యాడ్‌మీద వ్రాసింది: ''నీ మొదటి భార్య ఎందుకు చని పోయింది?''

''ఇదేనా నీ సందేహం జానకీ! ఈ సందేహమే నీ మనస్సులో అనుక్షణమూ మెలికెలు త్రిప్పుతూ నిన్ను యీ దుస్థితికి తీసికొచ్చిందా జానకీ! ఈ ప్రశ్నేనా రెండుమూడుసార్లు అడిగేందుకు ప్రయత్నించి, అడగలేకపోయావు! ఈ ప్రశ్నకు సరైన సమాధానాన్ని నానుంచి రాబట్టుకోలేక, నీకునువ్వే నా గత జీవితంమీద నీలినీడల్లాంటి నిర్ణయాలు చేసికొని — వర్తమాన జీవితానికి అన్వయించుకొని భవిష్యత్తును కురచ బర్చుకొని, ఇంతకాలమూ భయపడుతూ యీ దురవస్థకు దిగజారడం నిజమైతే, — ఆ నీలినీడల్ని నీ మనస్సునుంచి తొలగించడం తేలికే జానకీ! నా మొదటిభార్య మరణం అతి సహజం! కమల మరణానికీ, నీ బ్రతుకుమీద నువ్వు నిప్పులు గుమ్మరించు కోవటానికీ ఏమీ సంబంధంలేదు జానకీ! కమలన్ను నేను చంపలేదు. కమల అందవిహీనత నాలో ఆమెమీద ప్రేమను కలిగించలేక పోయిందిగానీ, ఆమె చావును ప్రోత్సహించలేదు.. ఇది నిజం! నమ్ము జానకీ! ఆమెను నేను చంపాననే పుకార్లు గిట్టనివాళ్లు లేవదీసినవి కానీ — వాస్తవంతో కూడుకున్నవి కావు. నా ఆదర్శానికి తగిన అందం ఆమె కలిగియుండని కారణాన — ఆమెని నా జీవితాన్నుంచి వేరు చేద్దామనే పాపపు తలంపు నాకెన్నడూ లేదు. సౌందర్యార్చనకు జీవితాన్ని అంకితం చేసిన నేను, ఇంట్లో అట్లాంటి సౌందర్యహీనమైన భార్యముఖం ఎప్పుడూ చూడలేకమనశ్శాంతినిమిత్తంఅప్పుడప్పుడూ తిరిగివచ్చేవాడినే గానీ — నీతికి ఎప్పుడు ద్రోహం చేయలేదు. శరీరవాంఛలకు నేనెప్పుడూ ప్రాముఖ్యత నివ్వను. నా ఆదర్శమూ, సౌందర్యారాధన మీద నాకున్న మోజూ — నీతిమాలినవి కావు, కలినమైనవి కావు. అందమైన వస్తువుల్ని హృదయపూర్వకంగా ప్రేమిస్తాను గానీ, అందంలేని వస్తువులు నాశనం కావాలని కోరే యింతటి దుర్మార్గుడ్ని కాదు. జానకీ! నన్ను నువ్వు అపార్థం చేసికున్నా, నా గురించి చెడుగా ఆలోచించి, నిజం తెల్సికున్నా — నిన్ను క్షమించేందుకు నా హృదయం ఎప్పుడూ ఆరాట పడుతూనే ఉంటుంది. జీవిత మార్గాల్లో దారితప్పుట కొత్తగాదు. కానీ సత్యాన్ని తెల్సికొని, హృదయాల్ని క్షాళిత పర్చుకొని, బ్రతుకు బాటలో కాంతిరేఖకోసం — నిండు మనస్సులతో, సంపూర్ణమైన విశ్వాసంతో ప్రయాణించడంలోనే ఉంది గొప్పదనం.'' అన్నాడు మంచం మీద నిద్రపోతున్నట్టు నటిస్తూ, భార్య ఏదో వ్రాసేందుకు పూనుకోగా లేచివచ్చిన భానుమూర్తి.

భర్తను చూసి మొదట్లో నిలువునా నిశ్చేష్టురాలైన జానకి, క్రమేపీ ఆయన మాటలు వింటూ తన మనస్సులోయిట్లా కమ్మిన అనుమానపు వలయం సడలిపోగా, హృదయం నిర్మలమై, పశ్చాత్తాపపు వాంఛ అధికమై ఆయన పాదాలకడ వ్రాలింది: 'క్షమించమని' ఆనందం పొంగి పొర్లుతూన్న కన్నీళ్లతో.

ఆమెను రెండు చేతులతో లేవనెత్తి, ఆమె కన్నీళ్లు తుడిచి, ఆమెచేత పదునైన చిరునవ్వు నవ్వింపజేసి — హృదయానికి గాఢంగా హత్తుకున్నాడు భానుమూర్తి.

మరునాడు ఉదయం —

''ఇవాళే నీకు ఆపరేషను చేసేరోజు'' అన్నాడు భానుమూర్తి భార్యతో.

''నాకు ఆపరేషన్ అవసరంలేదు. నా జబ్బు నయమవుతుంది'' అన్నది జానకి దృఢమైన విశ్వాసంతో.

★